అరాచక పాలనకు చరమగీతం పాడండి


నార్పలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్


గుంతకల్లులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- మాజీ మంత్రి శైలజానాథ్
- జనసంద్రమైన నార్పల
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

శింగనమల/నార్పల: కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలని వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ బుధవారం నార్పలలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉదయం 9 గంటలకే నార్పల తిక్కస్వామి ఆలయం, రామాలయం వద్దకు భారీగా వైఎస్సార్ సీపీ నేతలు చేరుకున్నారు. అనంతరం అశేష జనంతో కలిసి మాజీ మంత్రి జాకే శైలజానాథ్ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసమూర్తికి వినతి పత్రం అందజేశారు.

ప్రజల హామీలకు వెన్నుపోటు...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ పథకాలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కేసులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, మీరు వేసిన బీజాలే భవిష్యత్తులో కొనసాగుతాయని హెచ్చరించారు. పోలీసు వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని దాడులకు పాల్పడడం హేయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీలు భాస్కర్, భోగాతి ప్రతాప్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు నార్పల సత్యనారాయణరెడ్డి, గార్లదిన్నె నారాయణరెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, తరిమెల భాస్కర్‌రెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీలు రాఘవరెడ్డి, నాగేశ్వరావు, ఎస్సీ సెల్ నాయకులు చాములూరు రాజగోపాల్, బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు, పార్టీ విభాగాల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన సంద్రంగా నార్పల...

నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో నార్పల జనసంద్రంగా మారింది. మాజీ మంత్రి సాకే శైలజానాథ్ నార్పలకు రాగానే వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు భారీగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా మాజీ మంత్రి శైలజానాథ్ కార్యకర్తలతో కలసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి బుధవారం నార్పలలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. స్వచ్ఛందంగా ప్రజలు సైతం ఈ కార్యక్రమానికి హాజరై కూటమి ప్రభుత్వం మోసాలపై మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైయ్యిందన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు

- మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ధ్వజం

గుంతకల్లుటౌన్: అబద్ధపు హామీలతో గద్దెనెక్కి..పథకాలివ్వకుండా ప్రజల్ని వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఎన్నికలెప్పుడొచ్చినా కూటమి పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వ అన్యాయ, నిరంకుశ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ బుధవారం వైఎస్సార్‌సీపీ 'వెన్నుపోటు దినం' పేరిట నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. వైస్సార్‌సీపీ కార్యాలయం నుంచి వేలాది మంది పార్టీశ్రేణులు, అభిమానులతో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్‌డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

అన్ని వర్గాలను నట్టేట ముంచారు..

మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్నివర్గాలను నట్టేట ముంచారని మండిపడ్డారు. బాబూ ఏడాది పాలనంతా ప్రతిపక్షాలపై అక్రమ కేసులే తప్ప సూపర్‌సిక్స్ పథకాలు అమలు శూన్యమన్నారు. జగనన్న పాలనలో కరోనా లాంటి విపత్కర పరిస్థితులొచ్చినా 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. రాష్ట్రంలో గుడులు, బడుల కంటే ముందు మద్యం, బెల్ట్‌షాపులను తెరిచి పీకల్లోతు తాగిస్తూ వారిని తాగుబోతులుగా మారుస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో చిన్నారులు, ఆడవాళ్లపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నా ఆనాడు అండగా ఉంటానని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మం పేరిట రోజుకో అవతారమెత్తుతున్నాడే తప్ప మహిళలకు రక్షణగా నిలిచిందేమీ లేదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, గుత్తి వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.చెన్నకేశవరెడ్డి, గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు ఖలీల్, రాము, మధుసూదన్‌రెడ్డి, గంగరాజు, ఈశ్వర్‌రెడ్డి, రామకృష్ణనాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజనేయులు, యుగంధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌యాదవ్, సీనియర్ నేతలు మైనుద్దీన్, హుసేన్‌పీరా, గోవర్ధన్‌రెడ్డి, సివి.రంగారెడ్డి, నారాయణరెడ్డి, పార్టీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు, మూడు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పామిడి: గుంతకల్లులో బుధవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పామిడి నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్దెత్తున తరలివెళ్లాయి. పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రామకృష్ణనాయక్ సారథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వాహనాలు, బైక్‌లపై భారీసంఖ్యలో బయలుదేరారు.

గుత్తి: గుంతకల్లులో బుధవారం మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్‌రెడ్డి, గంగరాజు, మాజీ కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర నాయకులు సీవీ రంగారెడ్డి, జిల్లా నాయకులు గురుప్రసాద్‌యాదవ్, వెల్డింగ్ రవూఫ్‌తో పాటు వందలాది మంది వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందరూ గుంతకల్లుకు తరలివెళ్లారు.



యాడికిలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు

యాడికి: ఎన్నికల హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యాడికిలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినోత్సవం విజయవంతమైంది. ముందుగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని గృహ నిర్బంధం చేశారనే సమాచారం అందుకున్న తాడిపత్రి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం కార్యాలయంలో వరకూ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సుధాకర్‌బాబు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని యాడికిలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పాల్గొనకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. తాడపత్రిలో అప్రజాస్వామ్యం రాజ్యమేలుతోందని విమర్శించారు. ప్రజలకు మళ్లీ న్యాయం జరగాలంటే జగనన్న మరోసారి సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నేత ఫయాజ్‌బాషా, నాయకులు కేశవరెడ్డి, ఆర్‌సీ ఓబుళరెడ్డి, దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రగౌడ్, ఆర్టీఐ విభాగం ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ పఠాన్ ఫరూక్, యాడికి మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాగేష్, శివకేశవ రెడ్డి, వెంకటరామిరెడ్డి, గుడిపాడు వెంకట రామిరెడ్డి, మోపిరెడ్డి, పెద్దవడుగూరు మండల కన్వీనర్ శరభారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ హరినాథరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, హరినాథ రెడ్డి, వెంకటస్వామి గౌడ్, పెద్దపప్పూరు మండలంలో మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు

యాడికి: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. యాడికిలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి వస్తుండగా పచ్చారుమేకలపల్లి వద్ద ఆయన్ను యాడికి సీఐ ఈరన్న సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిందన్నారు. అయితే పోలీసులు తనను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని యల్లనూరు మండలం తిమ్మంపల్లిలో గృహ నిర్బంధం చేశారన్నారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కోన రోడ్డుకు వెళ్లి హర్షవర్ధన్ రెడ్డిని కలిసి మాట్లాడారు. అనంతరం పోలీసులు అక్కడ నుండి అందరినీ పంపించారు.

క్లుప్తంగా

తహసీల్దార్ పర్యటన

పామిడి: మండలంలోని సొరకాయల పేట గ్రామంలో బుధవారం తహసీల్దార్ ఎస్ శ్రీధరమూర్తి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలోని భూ సమస్యలు, ఇతరత్రా రెవెన్యూ సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడారు. రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చొరవ చూపాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం నారాయణ కాలేజీ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే యూనిఫాం, పుస్తకాలు, ట్యూషన్ల పేరిట అధిక ఫీజులు వసూలు ప్రైవేట్ కాలేజీలు, స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిశోర్, చందూ, సుశాంత్, అభి, జయరామ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పామిడి: వంకరాజుకాలువ గ్రామంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. బుధవారం ఆర్డీటీ డైరెక్టర్ లక్ష్మినారాయణ, సీడీపీఓ భారతి భవనాన్ని ప్రారంభించారు. ఆర్డీటీ సంస్థకు ఈసందర్భంగా గ్రామస్తులు, ఐసీడీఎస్ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తలారి లక్ష్మీదేవి, నరసింహ, ఎంపీటీసీ, సుబ్బారెడ్డి ఆర్డీటీ ఏటీఎల్ సావిత్రి, అంగన్‌వాడీ కార్యకర్త ఫాతిమా, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: సమాజంలో లింగ వివక్ష నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కొర్రపాడు పీహెచ్‌సీ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని పేర్కొన్నారు. బుధవారం వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ మాట్లాడుతూ బాలికలు కష్టపడి చదివి ఉన్నతస్థానాల్లో స్థిరపడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. బాలికలు రక్త హీనత నివారణకు పౌష్టిక ఆహారం క్రమ తప్పకుండా తీసుకోవాలన్నారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంత్సరాలు నిండిన తర్వాత పెళ్లి చేయాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆరోగ్య పరంగా బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య కార్యకర్త పర్వీన్, ఆదిలక్ష్మి, పెద్దక్క, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని

నాణ్యమైన విత్తనకాయలు అందించాలి

పెద్దవడుగూరు : ప్రభుత్వం రైతులకు నాణ్యమైన వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయాలని సీపీఐ మండల నేత, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాముడుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం అప్పేచర్ల రైతు సేవా కేంద్రంలో వేరుశనగ విత్తన కాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 90 శాతం సబ్సిడీడీ వేరుశనగ, పత్తి విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. విత్తన శుద్ధి మందులను ఉచితంగా అందించాలన్నారు. ఇప్పటి వరకూ రైతులకు పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడంతో ప్రయివేటు వ్యక్తులు, ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు అధిక ధరలకు విత్తనాలు అమ్ముతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ మొత్తాన్ని త్వరగా అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం నియోజవర్గ నాయకుడు ఆదినారాయణ, నాయకులు పోలా రంగస్వామి, నారాయణస్వామి, చెన్నారెడ్డి, శతర్, రైతులు పాల్గొన్నారు.


వేరుశనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న ఎంపీపీ యోగేశ్వరి

శింగనమల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ యోగేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో రోగులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీపై వేరుశనగ, కంది, ఆముదం, పెసర వంటి పంటలకు చెందిన విత్తనాలు అందించాలన్నారు. అంతకు ముందు అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరసింహులు, ఎంపీడీఓ భాస్కర్, సీడీపీఓ ఉమా శంకరమ్మ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమర గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం


బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయకులు

తాడిపత్రి రూరల్: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అమర గాయకుడని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీకట్ట వద్ద గల స్నేహ భారతి సంగీత శిక్షణాలయంలో బుధవారం గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి వేడుకలు జరిగాయి. గాన గంధర్వులు శ్రీ ఘంటశాల, ఎస్పీ బాలు మ్యూజిక్ అకాడమీ నిర్వాహుడు మహేష్ స్వామి ఆధ్వర్యంలో బాలు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలు పాడిన పాటలను గాయకులు పాడారు. వర్ధమాన గాయకులకు బాలు ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయకులు రామకృష్ణ, పాండురంగయ్య, శ్యామల, మాధవసుబ్రమణ్యం,శివ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

యల్లనూరు: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే రెడ్డిపల్లి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త భార్గవి సూచించారు. మండలంలోని వెన్నపూసపల్లి, 85- నిట్టూరు గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని కేవీకే రెడ్డిపల్లి పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంటల సాగు, రైతులకు సేంద్రియ ఎరువులు, వివిధ కేంద్ర ప్రభుత్వ స్కీంలు పీఎం కిసాన్, పీయంకే ఎస్పీ, ఫసల్ బీమా యోజన పథకం తదితర వాటిపై అవగాహన కల్పించారు. పంట సాగుకు పప్పుశనగ, సోయాచిక్కుడ వంటి విత్తనాల శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త శశికళ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు చెంగల్‌రాయుడు, మండల వ్యవసాయాధికారి రామకృష్ణుడు, హెచ్ఈఓ రామాంజనేయులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త భార్గవి

ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు : ముప్పాలగుత్తి గ్రామంలో ఇరువురి కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు..గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి సమీపంలోని ఎస్సీకాలనీ కి చెందిన ఓబులయ్య కుమారుడు నరసింహ, అదే కాలనీకి చెందిన లాలెప్ప కూతురు శ్రావణి మరి కొంత మంది పిల్లలతో కలిసి ఆడుకునేందుకు వెళ్లారు. ఈక్రమంలో నరసింహ అనే బాలుడు కిందకు పడి గాయాలపాలయ్యాడు. దీంతో బాలుడు తన తండ్రికి శ్రావణి తోసినట్లు చెప్పడంతో ఓబులయ్య, అతడి తండ్రి, తమ్ముడు రామచంద్ర శ్రావణి ఇంటి వద్దకు వెళ్లి ఘర్షణకు దిగారు. దీంతో అక్కడ ఉన్న రంగస్వామి, లాలెప్ప, ఓబుళపతి, రమేష్, ఓబులేసు తదితరులు ఓబులయ్య, రంగయ్యపై కట్టెలతో దాడి చేశారు. దాడిలో రంగయ్య, నరసింహకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

చోరీల నియంత్రణకు చర్యలు

అనంతపురం సిటీ: రైళ్లలో చోరీల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు గుంతకల్లు రైల్వే డీఎస్పీ హర్షిత చంద్ర తెలిపారు. బుధవారం అనంతపురంలోని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో రైళ్లలో జరిగిన చోరీల నేపథ్యంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సంయుక్తంగా కలసి ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైళ్లల్లో చోరీలకు పాల్పడినా, రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలనూ ఉపేక్షించేది లేదన్నారు. వందేభారత్ ఇతర రైళ్లపై రాళ్ల దాడులను కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. రైల్వే ప్రయాణికుల భద్రతే తమ లక్ష్యమని.. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అసాంఘిక శక్తుల ఆటలు కట్టడి చేసి, రైల్వే ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా చూస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రయాణ సమయాల్లో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. విలువైన బంగారు నగలు ధరించడం, నగదు వెంట తెచ్చుకోవద్దని సూచించారు. రైళ్లలో ప్రయాణించే సమయంలో కొత్త ప్రయాణికులు ఏదైనా తినుబండారాలు ఇస్తే తీసుకోవద్దన్నారు.

90 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు ఇవ్వాలి

పామిడి: మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నాణ్యమైన విత్తనాలను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని సీపీఐ సీనియర్ నాయకులు కే రహీమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుసేవా కేంద్రాల్లో వేరుశనగ విత్తనకాయలతో పాటు ప్రత్యామ్నాయంగా పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే ఎకరాకు మూడు బస్తాల చొప్పున వేరుశనగ విత్తన కాయలను ఇవ్వాలన్నారు. నాయకులు నాగరాజు, చౌడప్ప, ఇమాములు, రాముడు, ప్రసాద్, సూర్యనారాయణరెడ్డి, సారాబీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఫౌండేషన్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కేవీకే కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. కంది విత్తన రకాలైన ఎల్ఆర్‌జీ-52, 105, పీఆర్‌జీ-176, పెసర విత్తన రకాలు ఎల్‌జీజీ-514, 607, మినుములు, ఉద్దులు, రకం ఎల్‌బీజీ-884, అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి ధర కేజీ రూ.150 అన్నారు. ఫౌండేషన్ వరి బీపీటీ-5204 విత్తనం కేజీ రూ.47 అని తెలిపారు. వివరాలకు డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి 9493344440, డాక్టర్ శశికళ 7032058368, ముత్యాలరావు 9866713062, రంగానాయుడు 9704666923లో సంప్రదించాలని కోరారు.

రికార్డులు దగ్గర ఉంచుకోవాలి

పుట్లూరు: వాహనదారులు అన్ని రకాల రికార్డులను తమ వద్దే ఉంచుకోవాలని సీఐ సత్యబాబు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అతివేగంగా వెళ్లడం, చిన్నారులకు వాహనాలను ఇవ్వడం చేస్తే కేసులు నమోదు చేస్తామని వాహనదారులను హెచ్చరించారు.

'స్పందన' ఫిర్యాదుపై విచారణ


దిమ్మగుడి లో శంకర్ అనే బాధితుడి ఫిర్యాదుపై విచారణ చేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు : దిమ్మగుడి గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తి ఇచ్చిన పీజీఆర్ఎస్ అర్జీపై నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ప్రత్యేక ఉప కలెక్టర్ హెచ్ఎస్ఎస్ఎస్ మల్లికార్జునుడు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు అర్జీలో పేర్కొన్న సమస్యలపై ఆరా తీశారు. స్థానికులతో సమావేశమైన సమస్యను అడిగి తెలుసుకున్నారు. అర్జీదారుడికి ఇచ్చిన గడువు లోపు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని నియోజకవర్గ ప్రత్యేక అధికారి పేర్కొన్నారు. అనంతరం పెద్దవడుగూరులోని 2,3 రేషన్ షాపులను తనిఖీ చేశారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. గ్రామంలో పర్యటించి వృద్ధులకు రేషన్ ఇంటి వద్దకే వస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.